# అందని పళ్ళు

వేటిపీ వదిలారు. జైలునుండి బయట బడ్డాను, ముఖం జేబు రుమాలుతో తుడుచుకుంటూ నడుస్తున్నాను.

"నమస్కారం సుందరంగారూ!" అన్నారెవరో.

తలెత్తి చూశాను—సత్యం నిలబడి వున్నాడు—ప్రత్యభివందనం చేశాను.

"ఎక్కడున్నారు?" ప్రశ్నించాడు సత్యం.

"ప్రస్తుతం యిక్కడే!"

"హాస్యాలకేం గానీండి ఉద్యోగం?"

"మదనపల్లివద్ద ఓ గ్రామంలో సింగిల్ టీచరుగా వున్నా"నన్నాను.

"నేను రెవిన్యూ యిన్స్పెక్టరుగా వున్నాను" అదోరకమయిన సంతోషంతో నేనడక్కపోయినా చెప్పాడు సత్యం.

ఆ నవ్వు చూస్తే నాకు అరికాలిమంట నెత్తికెక్కింది.

కాని సరిగ్గా అలాంటినవ్వే అతడు ట్రెయినింగు అన్ని గ్రూపులూ ఫేలయినప్పుడు నేను నవ్వాను.

ట్రెయినింగు ప్యాసయిన నేను యేకోపాధ్యాయుడుగా అరణ్యవాసం చేస్తుంటే, ఫేలయిన సత్యం రెవిన్యూ యిన్స్పెక్టరుగా వున్నాడంటే నాలో కొద్దిగా యీర్ష్య రాజుకుంది.

"ట్రెయినింగు పూర్తి చెయ్యలేదూ?" అన్నాను అతను ట్రెయినింగు ఫేలయిన సంగతి జ్ఞాపకం చేసి నా గొప్ప చాటుకోవాలని.

"లేదు" అన్నాడు నిర్లక్ష్యంగా.

"ఏం?"

"ఎవరిక్కావాలండీ ఆ గాడిదలు మేపే వుద్యోగం," అంటూ ముందుకు సాగాడు సత్యం.

'గాడిదలు మేపే వుద్యోగం'—నన్ను ఛెళ్ళున లెంపకాయ వేసినట్లయింది. ఆ మాట అని వెళ్ళిపోయాడే గాని లేకుంటే సత్యం క్షమాపణ చేసేదాకా వదిలేవాణ్ణి గాదు.

ఎవరి వుద్యోగం వారికి గొప్పగా కనబట్టం సహజం గావచ్చుగానీ, సత్యానికి సత్యం వుద్యోగం గొప్పగా కనబడ్డంతో బాటు నా వుద్యోగం "గాడిదలు మేపే వుద్యోగం"గా కనిపించడం మాత్రం నాకు చాల చిరాకేసింది.

సత్యాన్ని గూర్చి యోచిస్తూ యింటిదారి బట్టాను... ట్రెయినింగు కాలంలో సత్యం నూటికి నూరుపాళ్ళు వుపాధ్యాయుడనిపించుకున్నాడు. అతడు మాట్లాడని సభ, సమావేశం వుండేదిగాదు. ప్రతి యెన్నికలలోనూ పోటీచేసి వోడిపోయేవాడు. అయినా 'అవమాన పడడం' అన్న విషయం అతడికి తెలీదు. చాలమంది విద్యార్థుల కతడంటే అయిష్టం, కొంతమందికి మాత్రం సరదా. ఈ "సరదాగాళ్ళ"లో నేనొకణ్ణి. ప్రతి సభకు, సమావేశానికి, యెన్నికలకు సత్యాన్ని నిలబెట్టి కనీసం మేమయినా ఓటు చేసే వాళ్ళంగాదు, అంతమాత్రాన అతను మా స్నేహం మానేవాడూ గాదు...

సభకు అధ్యక్షత వహించిన "పెద్ద మనిషి" తనకు అవకాశం యివ్వకపోయినా సరే తనులేచి తన వుపన్యాసం సాగించి యథాశక్తి మమ్మల్ని విసిగించి, కొండొకచో మాకుకోపం కూడా తెప్పించాడు.

## వల్లంపాటి వెంకటసుబ్బయ్య

అప్రస్తుతమయినాసరే ఉపాధ్యాయవృత్తికున్న గౌరవ ప్రాభవాలను గూర్చి చెప్పక మానేవాడుగాదు. ఎవరైనా తను స్వీకరించబోతున్న వృత్తిని విమర్శిస్తే వారిమీద యుద్ధం ప్రకటించేవాడు. "ఉపాధ్యాయుడు దేశనిర్మాత, అంతర్జాతీయ శాంతిదూత" అనేవాడు మాటిమాటికీ.

బహుకార్యభారంవల్ల ఫేలయాడే గానీ సత్యం తెలివయినవాడే. బహుశా ఆవిషయం అతడికి తెలుసేమో, అందుకే చదవడు.

అలాంటి సత్యం యీనాడు వుపాధ్యాయవృత్తిని "గాడిదలు మేపే వుద్యోగం"గా చిత్రిస్తున్నాడంటే నాకు ఆశ్చర్యంగా వుంది.

తరువాత రెండు మాసాలు సత్యాన్ని మరచిపోయాను...

ఏదో పనిమీద చిత్తూరు వెళ్లాల్సివచ్చింది. చిత్తూరు వెళ్ళినప్పుడల్లా సినిమా చూట్టం నా కలవాటు. ఆ రోజు యేదో సినిమాకెళ్లాలని థియేటరుముందు నిల్చున్నాను. చంకలో మోపెడుపుస్తకాలతో వెళ్తున్నాడు సత్యం. నన్ను చూసికూడా ముఖం చాటుచేసుకోవడంకోసం ప్రయత్నించాడు... కాని నేనే పలకరించాను. అతడితో మాట్లాడ్డమంటే నాకు అదో కాలక్షేపం.

"ఏమోయ్ సత్యం! మేమంత చూడగూడని మనుషులమా?"

సత్యం సిగ్గుపడుతూ నాదగ్గరకు వచ్చాడు. ఒక పదినిమిషాలసేపు పట్నంలోని సినిమాలలో మంచిదేదన్న విషయం చర్చించాము.

"సినిమాకెళ్దాం రావోయ్," అన్నాను చివరకి.

"పరీక్షలు పది దినాలే వుంట," అన్నాడు సత్యం.

"ఏం పరీక్ష?"

"ట్రెయినింగు పరీక్ష," అన్నాడు తల వంచుకొని.


నేను ఆశ్చర్యంతో తలమునకలయిపోయాను. అతడిమీద ఎలాగయినా ఒక విసురు విసరాలనిపించింది. "నీ కెందుకోయ్ యీ 'గాడిదలు మేపే వుద్యోగం'? అన్నాను.

సత్యం తల యెత్తాడు. అతని కళ్ళలో వుత్సాహం వచ్చిచేరింది.

"మేపాలని రూలు లేదుగా! అయినా దీనికేమిటోయ్ బంగారంలాంటి వుద్యోగం—దినానికి ఐదు గంటల పని. సంవత్సరానికి

(64-వ పేజీ చూడండి)

మీరు మలబార్ గ్లోరీ టాయిలెట్, సబ్బును ఎన్నుకొన్నది చాల మంచిపని




ది వెజిటబుల్ సోప్ వర్క్సు,
కోజికోడ్. 1.

# దేశంలో అంధులకు సహాయం

(48-వ పేజీ తరువాయి)

ర్థులు చదువుకుంటున్నారు. కేంద్రాధీనమయిన దీనికి "ట్రెయినింగ్ సెంటర్ ఫర్ ది ఎడల్ట్ బ్లయిండ్" అని పేరు.

ఈ సంస్థలో రెండేళ్ళ కోర్సు పెట్టబడింది. విద్యార్థులకు వ్రాయను చదువను కాకుండా వ్యవసాయిక శిక్షణకూడా ఇవ్వబడుతుంది. ఇక్కడి విద్యార్థులకు బ్రెయిలీ లిపిద్వారా హిందీ, లేక ఇంగ్లీషు చెప్తారు. ఇంతేకాక నవారు అల్లడం, దుప్పట్లు-కంబళ్ళు నెయ్యడం, కొవ్వొత్తులు-సిరబుడ్లు తయారు చెయ్యడం, పేము కుర్చీల అల్లకం మొదలైనవన్నీ నేర్పుతారు. ప్లాస్టిక్ పనులు, రాట్నం వడకడం కూడా చెప్తారు. వీటితో బాటు విద్యార్థులకు టైప్ రైటింగ్ షార్ట్ హేండ్ లలో కూడా శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ సంస్థలోని మరొక మహత్తర అంగం సంగీత శిక్షణ. మామూలు పాటలు—శాస్త్రీయ సంగీతం రెండూ కూడా నేర్పుతారిక్కడ.

ఇటువంటి శిక్షణ మనదేశంలోని పెద్ద పెద్ద కేంద్రాలలో ఉంది. ఈ సంస్థలో నూటయాభైమంది విద్యార్థులు శిక్షణల పొందుతున్నారు. వారి ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తోంది. వారికి డాక్టర్ చికిత్స కూడా ఉచితంగా చేస్తారు. ఇక్కడ క్రమపద్ధతి ననుసరించి అందరికి ప్రవేశం లభిస్తుంది.

గత సంవత్సరం ఇక్కడ ఒక మహిళా విభాగం కూడా పెట్టారు. ఈ విభాగంలో స్త్రీలకి చేతిపనులు, కుట్టూ కూడా విద్యతో పాటు చెప్పబడతాయి. ఏభయిమంది ఆడవారికి తగిన సౌకర్యాలిక్కడ ఉన్నాయి.

దేశంలో ఇప్పటివరకూ అంధబాలుల విద్యకి తగిన సౌకర్యాలు లేవు. కాని 9151 లో అజమేర్, కట్బలలో పాఠశాలలు పెట్టిన తరువాత ఈలోటు కొంత భర్తీ అయింది. డెహరాడూన్‌లో భారత ప్రభుత్వం అంధుల కోసం ఒక ఆదర్శపాఠశాల స్థాపించబోతోంది. ముమ్ముందు ఆ కార్యం సఫలం కాగలదని ఆశిద్దాం. ఈ పాఠశాలలో చిన్నవయస్సు పిల్లల్ని జేర్చుకుంటారు. ఇక్కడ ఉపాధ్యాయుల శిక్షణకి కూడా వేరే ఏర్పాటుంటుంది.

శిక్షితులైన అంధులకి ఉద్యోగాలివ్వడం భారత ప్రభుత్వానికి సమస్యగా ఉంది. ప్రభుత్వం ఈ సమస్యని తేలిక చెయ్యడం కోసం 1955 లో మద్రాసులో ఒక విభాగం స్థాపించింది. వివిధ వృత్తుల్లోని గ్రుడ్డివారికి పని కల్పించడమే దీని లక్ష్యం. ఇప్పటి వరకూ జరిగిన లెక్కల ప్రకారం పద్దెనిమిది [illegible]లో డెబ్బయిమందికి ఉద్యోగ సౌకర్యాలు కల్పించిందీ విభాగం. భారత ప్రభుత్వమే కాక కొన్ని ఇతర ప్రభుత్వ సామాజిక సంస్థలు కూడా అంధుల ఉద్యోగాల విషయంలో తోడ్పడుతున్నాయి. 1952 లో అంధుల కోసం జరిగిన సమ్మేళనంలో అన్ని ప్రభుత్వ ప్రతినిధులూ పాల్గొన్నారు. ముఖ్య విషయాల చర్చానంతరం "నేషనల్ ఎసోసియేషన్ ఫర్ దీ బ్లయిండ్" స్థాపించబడింది. దీని ముఖ్య కార్యాలయం బొంబాయిలో ఉంటుంది.

1955 లో తిరిగి ప్రభుత్వం ఆధ్వర్యాన అంధుల సమస్యమీద మసూరీలో ఒక గోష్ఠి జరిగింది. విశ్వవిఖ్యాత అంధమహిళ మిస్ హెలెన్ కెల్లర్ దానికి ముఖ్యురాలు. భారతీయ భాషల్లో బ్రెయిలీ సాహిత్య నిర్మాణం గురించి చర్చించారీ గోష్ఠిలో. అంతే కాకుండా అంధులు రాసుకునే, ఆడుకునే వస్తువుల తయారీకోసం, మధ్యలో అంధులైనవారి వసతి అవసరాలగురించి చర్చించారు.

1950 లో మన ప్రభుత్వం భారతీయ బ్రెయిలీ లిపిలో సాహిత్య నిర్మాణంకోసం డెహరాడూన్‌లో "సెంట్రల్ బ్రెయిలీ ప్రెస్" పెట్టింది. ఆగ్నేయ ఆసియాలో ఇదొక్కటే బ్రెయిలీ ప్రెస్. బొంబాయిలో ఇలాంటి ప్రెస్ ఒకటి ఉన్నా అదింకా పని ప్రారంభించలేదు. అదికూడా పని మొదలెడితే దేశంలో తగినంత బ్రెయిలీ సాహిత్యం ముద్రితం కావచ్చు.

డెహరాడూన్‌లో నున్న "సెంట్రల్ బ్రెయిలీ ప్రెస్" లో ఇప్పటివరకూ హిందీ-గుజరాతీ-మరాఠీ-తమిళం-తెలుగు-ఇంగ్లీషులలో సుమారు ఏభయి పుస్తకాలు అచ్చయాయి. వీటిలో స్కూళ్ళకి సంబంధించిన చరిత్ర-భూగోళం-సాహిత్యం మొదలైన పుస్తకాలు చాలా ఉన్నాయి. అంతేకాదు. రవీంద్రనాథ్ టాగూర్, ప్రేమచంద్ మొదలగు సుప్రసిద్ధ రచయితల పుస్తకాలుకూడా తయారవుతున్నాయి. స్వామీ శివానంద రచించిన "గీత" ఇంగ్లీషు బ్రెయిలీ లిపిలో ఇటీవలే ముద్రితమయింది. ఇవి చాలా ప్రతులు విదేశాలకు పంపబడ్డాయి.

అంధుల సంపూర్ణ వికాసంకోసం "ఆలోక్" అనే త్రైమాసపత్రిక హిందీ బ్రెయిలీ లిపిలో అచ్చవుతోంది. దీంట్లో కథలే కాక సామాజిక వ్యాసాలు, కవిత్వాలు కూడా ఉంటాయి. ఈ పత్రికలో స్త్రీలకి, పిల్లలకి ప్రత్యేక శీర్షికలున్నాయి. ఈ పుస్తకం అంధులకు మూడణాలకు ఖరీదుకి ఇవ్వబడుతుంది.

ఇంకా ఈ ప్రెస్‌లో అంధులాడుకునే చదరంగం సామానులు రాసుకునే పలకలు తయారుచేస్తారు. ఇవి మన దేశంలో చెయ్యడంవల్ల విదేశాలనించి తెప్పించనక్కరలేదు. ప్రెస్ పెట్టి ఎనిమిదేళ్ళు కావొస్తున్నా తగినంత తయారీ కావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పుడు దీని అభివృద్ధికి ఏర్పాట్లు చేస్తోంది ★

# అందని పళ్ళు

( 23-వ పేజీ తరువాయి)

వందాయాబై శెలవులు - అధికారుల ఒత్తిడి తక్కువ—అందుకోసం - వస్తా ట్యూషను కెళ్ళాలి" అంటూ వెళ్ళబోయాడు.

"రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగిరీ వదిలేశావా?" ఆపి ప్రశ్నించాను.

"మా నాన్న తిథికి శెలవడిగాను 'జమాబందీలసమయం, ఇవ్వడానికి వీలే' వన్నాడు తహసిల్ దారు. నాకు ఒళ్ళుమండి రాజీనామా గీకేశాను. అయినా అదొక వెధవ ఉద్యోగం కష్టం లేదూ. పాడూ లేదు;" నా మెదడులోకి కొన్ని ప్రశ్నలు చొప్పించి సత్యం నిష్క్రమించాడు.

సత్యానికి ఒకనాడు వుపాధ్యాయవృత్తి దేశనిర్మాణం, అంతర్జాతీయ శాంతి ధ్యేయాలుగా వున్న పవిత్రమయిన వృత్తిగా కనబడింది. ఆ ట్రెయినింగు కాస్తా ఫేలయేసరికి అదొక గాడిదలు మేపే వుద్యోగంగా కనబడమే గాక ఆ రెవిన్యూ యిన్‌స్పెక్టరుగిరి యింద్రపదవిగా భాసించింది. ఈనాడు సత్యం ఫేలయిన ట్రెయినింగు పరీక్షకోసం చదువుతున్నాడంటే ఆశ్చర్యం గాక మరేమిటి? అసలు సత్యం ఆ యింద్రపదవిని యెందుకు కాలదన్నాడు? "పవిత్రంగా", "గాడిదలు మేపే వుద్యోగం"గా కనిపించిన ఉపాధ్యాయవృత్తి యీడో సారి "శెలవులు అధికంగా వున్న వుద్యోగం"గా సత్యంకు కనిపించడంలో అంతర్యమేమిటి?

భుజంమీద యెవరో చెయ్యి వేశారు. ఆలోచనలకి కళ్ళెం వేస్తూ వెనుదిరిగి చూశాను—శంకరం.

చాలదినాల తర్వాత కలుసుకున్నాం కనుక అనేక విషయాలు మాట్లాడుకున్నాం. ఆ మాటల్లో సినిమా సమయం మించిపోవడం కూడా తెలియలేదు.

"అఁ......సత్యాన్ని డిస్మిస్ చేశారు తెలుసా?" అన్నాడు శంకరం.

"ఏం?" ఔత్సుక్యంతో ప్రశ్నించాను.

"అఁ...ఏముంది...ఏదో కరప్షను కేసట" అన్నాడు శంకరం.

నా మనస్సులోని సందేహాలన్నీ తీరిపోయాయి. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad